# కొత్త జీవితం

రోగంతో చిక్కి సగమై, మంచానికి ఘోరంగా అంటుకుపోయిన పిల్లవాడ్ని డాక్టరు చూశాడు. పరీక్ష చేశాడు. క్రింది పెదవి విరిచాడు. కనుబొమలు వంకరగా ముడిచి, కొంచెంసేపు గట్టిగా ఆలోచించాడు.

ఆ పిల్లవాని మంచం ప్రక్కనే నిలబడ్డ తల్లి - కళ్ళల్లో ప్రాణాన్ని బిగబట్టుకొని డాక్టరుగారి కేసి చూస్తోంది. పిల్లవాని తలగడ చెంతనే నిలబడ్డ తండ్రి ముఖంలో విషాదంతో కూడు కున్న ఆదుర్దాని ప్రకటిస్తూ డాక్టరుగారి కేసి చూస్తున్నాడు. ఆ పూరికొంపలో కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం నిక్కబొడుచు కున్నది.

కళ్ళజోడు తీసి జేబు రుమాలుతో తుడుస్తూ, గంభీ రంగా అన్నాడు డాక్టరు—

"పిల్లవాడి పరిస్థితి చాల ముదిరిపోయింది. అయినా ఇంతకాలం అశ్రద్ధగా ఉన్నారేం? అశ్రద్ధే చాల రోగాల్ని చేయి దాటింపజేస్తూన్నది. ఈ కేసింకా చేయిదాటి పోలే దనుకోండి. అంతగా అధైర్య పడాల్సిన అగత్యంలేదు. ఇంజక్షన్సు వ్రాసి యిస్తాను. వెంటనే తెప్పించండి. అవి తెస్తే పిల్లవాడు తప్పకుండా బ్రతుకుతాడు".

డాక్టరు ఇంజక్షన్సు ఓ చీటీ మీద వ్రాసి యిచ్చాడు. ఆ చీటీని అందుకుంటూ పిల్లవాని తల్లి-"ఎంత ఖరీదు అవుతా యండీ?" అన్నది.

"పదిహేను రూపాయలవరకూ కావచ్చు. మళ్ళీ నేను రెండు మూడు గంటల తర్వాత వస్తాను. అశ్రద్ధ చేశారంటె అబ్బాయి దక్కే అవకాశమే ఉండదు". డాక్టరు వెళ్ళాడు. మెడిసిన్ బాక్సును రిక్షావరకూ తీసికెళ్ళి రిక్షాలో పెట్టి, డాక్టరుగారికి నమస్కారం పెట్టి-ఇంట్లోకి వచ్చాడు పిల్లవాని తండ్రి చంద్రం.

మూసుకుపోయింది ఉదయం. తొమ్మిది గంటలైనా సూర్యుడికి నల్లని మేఘాల్నుంచి విముక్తి కలగలేదు.

పిల్లవానితల్లి శాంత ఇంట్లోకి వచ్చిన భర్తకేసి దీనాతి దీనంగా చూసింది. ఆ చూపులో దుఃఖం జవజవలాడుతోంది. ఆ చూపును భరించలేక చంద్రం ముఖాన్ని తడికెవైపుకు మరల్చాడు. మంచంలో అయిదేళ్ళ పిల్లవాడు అచేతనంగా పడివున్నాడు - మృత్యుద్వారంలో పడివున్నట్టు.

"ఇంజక్షన్లు తీసికొని రావాలి. లేకపోతే బాబు బ్రతకడు" అన్నది శాంత గొంతులో వుండగట్టిన దుఃఖం ద్రవిస్తూండగా.

'ఆ సంగతి నాకూ తెలుసు. కాని డబ్బెక్కడిది? పది హేను రూపాయలు...' అనుకున్నాడు చంద్రం. కాని బయ టకు అనలేదు. అనలేకపోయాడు. భర్త మౌనాన్ని భార్య అర్థం చేసుకుంది. ఆమెలో ఆవేశంతో కూడుకున్న ఆదుర్దా చావుకు సిద్ధమైవున్న పిల్లవాడ్ని బ్రతికించుకోలేక పోతున్నా మన్న దిగులూ, ఒక్కగా నొక్క పిల్లవాడు, తల్లిదండ్రులు మందు తెచ్చి యివ్వలేని అశక్తతవల్ల పాలుగారే బ్రతుకును చాలించాల్సివచ్చిన విషాదమూ- మెలికెలు తిరుగుతున్నాయి. దుఃఖంతో గుండె ఎఱ్ఱ నవుతూన్నది. ఆవేదనతో కళ్ళు నీటికి కాళ్ళు దువ్వుతున్నాయి. జీవితానికి వెలుగు మాసి పోతోందన్న భయం హృదయంలో చీకటి గోళాన్ని ప్రవేశ పెట్టింది.

"మీ దగ్గర డబ్బులేదా?" దుఃఖంలో కలిగిన తెగిం పుతో నేలమీద గడ్డపలుగు దింపినట్టుగా ప్రశ్నించింది శాంత.

ఆ ప్రశ్నకు చంద్రం చివుక్కున కళ్ళు పైకెత్తి పదు నుగా భార్యకేసి చూశాడు. 'చచ్చిన పామును ఇంకా చంపా లని ఎందు కనుకుంటారు ఆడవాళ్ళు?'

"లేదు."

"మరెట్లా?"

చంద్రం మాట్లాడలేదు. ముఖాన్ని క్రిందికి దించుకున్నాడు.

శాంతలో దుఃఖం కట్టలు త్రెంచుకోగా ఒక్కసారి బావురుమని ఏడ్చింది.

"బాబు ... బాబు ... ఎట్లా?... ఇంజక్షను ఇవ్వకపోతే...బ్రతకడు. వాడ్ని మనమే...మన చేతులతోనే చంపుతున్నాం. మనం హంతకులం" శాంత పరవళ్లు త్రొక్కే ఉద్రేకంతో మాట్లాడుతున్నది.

చంద్రం బెల్లంకొట్టిన రాయిలాగా చేతులు విరిగిన కుర్చీలో చేతులు ముడుచుకొని కూర్చున్నాడు. అతనిలో కష్టాల కతీతమైన గంభీరత, మూర్తీభవించిన ప్రశాంతత కనబడుతోంది.

శాంత కొంచెంసేపు మంచం దగ్గిర చతికెలబడి కడుపులో గుడగుడలాడుతూన్న దుఃఖాన్ని కన్నీళ్ళద్వారా వెళ్ళగ్రక్కింది. పిల్లవాడ్ని చూస్తూన్నకొద్దీ ఆమెలో డాక్టరుగారి మాటలు మార్మ్రోగుతూ- ఆందోళననూ, భయాన్నీ, ఆవేశమయాన్నీ, తెగింపునూ పెంచసాగాయి.

"ఈ కొంపకీ దుస్థితి తెచ్చిపెట్టింది మీరే. చివరకు చావు బ్రతుకుల్లోవున్న ఒక్కగానొక్క కొడుక్కి మందిప్పించి బ్రతికించుకొనే యోగంకూడా లేకుండా చేశారు. ఇంట్లో నయాపైసా లేదు. ఈ బీదరికానికి మీరే బాధ్యులు. ఈ దారిద్ర్యానికి మీరే కారకులు. మూడెకరాల పొలమూ,

నాలుగువేల రొక్కమూ, పేకాటలో నాశనం చేశారు. నేనెంత మొత్తుకున్నా రవ్వంత చెవిన పెట్టలేదు. ఆస్తీ, డబ్బూ, పరువూ, ప్రతిష్ఠా, సంసారమూ-అన్నీ మీా జూదానికి ఆహుతయి పోయాయి. ఇప్పుడేం చేయాలి? పదిహేను రూపాయలు పెట్టి ఇంజక్షన్లు ఎట్లా తెస్తారు? తీసుకురండి. లేకపోతే పిల్లవాడు మనకు దక్కడు. వాడ్ని బ్రతికించుకొనే బాధ్యత మనపై ఉన్నది. ఆ బాధ్యతను నెరవేర్చలేకపోయా మంటే - భగవంతుడు కూడా మనల్ని క్షమించడు.”

ఒక్కొక్క మాట అతని గుండెలో ఒక్కొక్క బల్లెంలా గుచ్చుకున్నది. అయినా చంద్రం ముఖం పైకి ఎత్తలేదు. చేతులు విరిగిన కుర్చీలో చేతులు ముడుచుకొని బెల్లం కొట్టిన రాయిలాగా కూర్చున్నాడు.

పిల్లవాని మంచం దగ్గరనుంచి బరువుగా లేచి శాంత భర్త యెదుట నిలబడింది. చంద్రం ముఖం పైకెత్తి ఆమెకేసి చూడలేక పోయాడు. ఆమెలో దుఃఖం వెల్లువయితే, అతనిలో దుఃఖం అంతర్వాహిని.

“ఇవిగోండి. ఈ బంగారపు గాజులు అమ్మి, బాబుకు ఇంజక్షన్లు తీసుకురండి” అంటూ శాంత తన చేతులకు మిగిలిన జత బంగారపు వొంకీల గాజుల్నీ భర్తముందు పెట్టింది.

చంద్రంలో రోషం, అభిమానం, అవమానం, న్యూనత, బాధ-బుస్సున మనిషి ఎత్తున లేచాయిగానీ, అంతలోనే తనకు తాను దిగమ్రింగుకున్నాడు. ఆ గాజుల్నీ, మందు చీటీని జేబులో పెట్టుకొని బజారుకు బయలుదేరాడు.

"త్వరగా రండి. డాక్టరుగారు వస్తారు" అన్నది శాంత వీధిలోకి వెళుతూన్న భర్తతో.

తల ఆడిస్తూ వెళ్ళాడు చంద్రం.

మూసుకుపోయిన ఉదయం - ఎర్రని ఎండతో ఆగ్రహావేశంతో ఉన్న పగలుగా మారింది.

గాంధీచౌకు మీదుగా, షరాబు బజారుకు వెళ్ళాడు చంద్రం.

మోతీలాల్‌చంద్ వెండి, బంగారు కొట్లోకి జొరబడ్డాడు చంద్రం. మోతీలాల్ ఆ గాజుల్ని గీటురాయి మీద పరీక్షించి, మెరుగుచూచి, క్రింది పెదవి విరిచి, కళ్ళు గుండ్రంగా తిప్పి, ముఖం చిట్లించి, తూకంవేసి చూసుకొని - అయిష్టంగా దానా ధర్మం చేస్తూన్నట్టు అయిదు పది రూపాయల నోట్లను అతని చేతిలో పెట్టాడు.

ఆ నోట్లను చూడగానే చంద్రం ముఖం చంద్రబింబమంత అయింది. 'ఎన్నాళ్ళయింది. ఇంత డబ్బు ముఖం చూసి! త్వరగా ఇంజక్షన్లు కొనుక్కెళ్లాలి. అవతల శాంత తనకోసం ఎదురు చూస్తూ, ఆదుర్దాపడుతూ వుంటుంది. శాంత మనసు ఎంత మంచిది! కష్టాల్లో ఆమె కెంత తెగింపు! పెళ్ళినాటి బంగారపు వొంకీల గాజుల్ని అమ్మటానికి రవ్వంత జంకలేదు. ఏం చేస్తుంది - చావుకు సిద్ధమై వున్న పిల్లవాడ్ని బ్రతికించుకొనేందుకు అవసరమైన మందు తేలేని తనలాంటి మొగుడితో! ఛీ, ఛీ, తనెంత దుర్మార్గుడు? దుర్వ్యసనాలతో ఇంటి సౌభా

గ్యాన్నీ, గౌరవ మర్యాదల్నీ నిలువునా మంటగలిపాడు. ఆమె మాటల్ని వినివుంటే సంసారం యింతగా పతనమై వుండేదికాదు. ఆ ఇల్లాలి మనస్సును అనుక్షణమూ కష్ట పెడుతూ, కన్నీటిని నిరంతరం చూస్తూ, అమృత వాక్కులను పెడచెవిని పెడుతూ - పచ్చని సంసారాన్ని జీర్ణవస్త్రం స్థితి లోకి తెచ్చాడు. అయినా తనంటే శాంతకు ప్రేమాభిమానా లున్నాయి. తన అధఃపతనంపై ఆమెకు సానుభూతిఉన్నది...' అనుకుంటూ చంద్రం ఆ యాభై రూపాయల్ని జేబులో భద్రంగా పెట్టుకుని గబగబా నడువసాగాడు గాంధీచౌకులోని మెడికల్ షాపుల కేసి.

"వారేయ్! చంద్రం" బాగా పరిచయమున్న కంఠం వినిపించగానే, చంద్రం గిరుక్కున వెనక్కు తిరిగాడు.

రిక్షాలో జోరుగా వెళుతూన్న శేఖరం - క్లాత్ ఎంపో రియం ముందు రిక్షాని ఆపుదల చేయించాడు.

"ఏం గురూ! ఎక్కడకు?"

"రిక్షా ఎక్కు. వెళదాం. ఆజ్-కల్ నీ దర్శనాలు కరువయ్యాయ్!"

"నాకు పనుంది గురూ! నువ్వెళ్ళు".

"ఏం పని? ఆ పనిముందు మిగతా పనులన్నీ బలా దూరే! అట్టే వాగక-ముందు రిక్షా ఎక్కు. త్వరగా వెళదాం. ఇప్పటికే టేబుల్ ఫారమ్ అయివుంటుంది. ఆలస్యం చేస్తే సీటు

దొరుకుతుందో, లేదో" అన్నాడు శేఖరం చార్‌మినార్ సిగరెట్టు పీలుస్తూ.

చంద్రం వేపకాయతిన్న ముఖం పెట్టాడు.

"నేను రాలేను గురూ! పేకాట మానివేశాను. బళ్ళారి చచ్చులావుంది జూదం. దాని జోలికి పోదల్చుకోలేదు."

కనుబొమలపై విపరీతమైన ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ— "ఇదెప్పట్నుంచిరోయ్! ఏమిటి నీలో యీ పరివర్తన! మూడో ప్రపంచయుద్ధం రావడం లేదుగదా! నీకూ, నాకూ పేకాటమీద విరక్తి యేమిటి? - ఇవాళరా, పెచ్చు పడుతుందిలే. వారం రోజుల్నుంచీ ఆడటం లేదుగా. ఇవాళ తప్పకుండా పెచ్చుపడుతుంది. కనీసం రెండు బ్యాంకులకైనా గెల్చుకో గలవు వందరూపాయలు" అన్నాడు శేఖరం.

'రెండు బ్యాంకులు! వంద రూపాయలు! నిజమే! తను వారం రోజుల్నుంచీ పేకాట ఆడడంలేదు. పెచ్చు పట్టుకోవచ్చు. పెచ్చు ఆడితే - రెండు బ్యాంకులు రావట మెంతసేపు? రెండు కట్‌లు ఆడితే చాలు. డబుల్స్ డీల్, బోనస్ షో - చేస్తే చాలు. ఎనిమిదివందల పాయింట్లు తన్నుకుంటూ రావూ? ఎనిమిదివందల పాయింట్లంటే - వందరూపాయలు. వంద రూపాయలతో తన దురదృష్టం బోర్లాపడి అదృష్టం తల ఎత్తుకోవచ్చు. తన కివ్వాళ కల్సిరావచ్చు. భార్య గాజులు అమ్మిన డబ్బులో ఆ మహాత్మ్యం వుండొచ్చు. పెదరావూరు చెంచయ్య భార్యమెడలో తాళిబొట్టు అమ్మిన డబ్బుతో పేకాట ఆడికదూ - నాలుగేళ్ళలో లక్ష రూపా

యల మేడకట్టింది. ఒక్కొక్క వేళలో, ఒక్కొక్క సంఘటనలో - జీవితాన్ని తలక్రిందులుగా మార్చే అదృష్టం పట్టవచ్చు. ఆ మలుపు సుళువు తెల్సికోవటంలోనే వుంది - కిస్మత్ !' చంద్రం మనస్సులోని ఆలోచనలు అరచేతిలోని వైకుంఠాన్ని చూపెట్టగా, మారుమాట్లాడకుండా రిక్షా ఎక్కి, పేకాటలో పి. హెచ్. డి. పుచ్చుకున్న శేఖరం ప్రక్క కూర్చున్నాడు.

రిక్షా గాంధిచౌకు మీదుగా బోసురోడ్డుకు మళ్ళింది. మెడికల్ షాపులు, భార్య శాంత భర్తకోసం నిరీక్షిస్తూ ఆదుర్దాపడడమూ, చావు బ్రతుకుల్లోవున్న ఒక్కగానొక్క కొడుకూ, 'మళ్ళీ వస్తాను. ఇంజక్షన్సు తెప్పించండి' అన్న డాక్టరుగారి మాటలూ...ఇవేమీ చంద్రం మనస్సులో పీఠం వేసికొని కూర్చోలేదు. అతని మనస్సు కొత్త అదృష్టాన్ని కల్పించుకుంటూ ఆనందపడుతూన్నది. 'ఇవాళ రెండు బ్యాంకులు చాలు. అణాల ఇంటర్ నేషనల్లో రెండు బ్యాంకులంటే వంద రూపాయలు! ఈ వంద రూపాయలతో రేపు బేడలు ఆడవచ్చు. బేడల్లో రెండు బ్యాంకులొస్తే పావలాలు ఆడవచ్చు. అందులో కూడా కల్సివస్తే - అర్ధ రూపాయలు, రూపాయలు, ఆ తర్వాత టూస్, ఫోర్స్, ఫైవ్స్ కూడా...ఏముంది ? కల్సివస్తే - ఒక్క సంవత్సరంలోనే పేకాటలో లక్షలు గడించవచ్చు. అట్లా గడించి బాగుపడ్డవాళ్ళెంతమంది లేరు?...తనకూ ఆ నమ్మకం వుంది. 'ఎప్పటికైనా ఈ పేకాటలోనే తను బాగుపడాలి' అన్న గాఢవిశ్వాసం

తో నేతను యింతకాలమూ, ఎన్నిసార్లు బ్యాంకులకు బ్యాంకులు ఓడిపోయినా, ఉన్న ఆస్తీ, డబ్బూ హరించుకుపోయినా, భార్య కన్నీటితో కాళ్ళకు చుట్టివేసికొని అడ్డుపడినా, పరువు ప్రతిష్ఠలు దీపంలోని పురుగులకుమల్లే మాడిపోయినా—పేకాట ఆడుతూన్నది. తన ఆత్మవిశ్వాసం, పట్టుదలా - ఎప్పటికైనా కోరిన అదృష్టాన్ని తెచ్చిపెడతాయి. తన కలలు ఫలిస్తాయి. తనకూ - లక్షరూపాయల మేడకట్టి, యాభై ఎకరాల పొలం కొని, ప్లిమత్ కారులో తిరిగే హోదాతో బ్రతికే యోగం పడుతుంది - అట్లాంటి మధురమైన ఆలోచనలు చంద్రం మనస్సులో చిరునవ్వులు చిందిస్తూండగా రిక్షా, క్లబ్బు ఆవరణలో ఆగింది.

చంద్రమూ, శేఖరమూ రిక్షా దిగారు. రిక్షావాడికి శేఖరమే డబ్బులిచ్చాడు. ఇద్దరూ తూర్పు ప్రక్క గదిలోకి వెళ్ళారు. కోయంబత్తూరు ఇంటర్ నేషనల్ రమ్మీ అణాలు—ఎనిమిదిమంది ఆడుతున్నారు. శేఖరమూ, చంద్రమూ, చెరి యాభై రూపాయలిచ్చి, చెరొక బ్యాంకూ కొనుక్కుని, 'కట్' జరిగాక జాయిన్ అయ్యారు. అప్పుడు పగలు పదిన్నరగంటలైంది. శేఖరం క్లబ్బు ప్యూనును పిల్చి—రెండు కాఫీలకు ఆర్డరిచ్చాడు.

'ఇవాళ తను రెండు బ్యాంకులు గెలవాలి' గట్టిగా మనస్సులో అనుకుంటూ చంద్రం తనకి పంచబడ్డ పదమూడు ముక్కల్నీ వొణికే చేతులతో తీసుకున్నాడు. ఆటీను ఆసు జోకరుగా తిరగబడింది. చంద్రం చేతిలోని పదమూడు

ముక్కల్లో రెండు బొమ్మజోకర్లూ, రెండు ఇస్పేటు ఆసులూ, రెండు పెయిర్లూ ఉన్నాయి. కానీ నాచురల్ సీక్వెన్సు లేదు. ఒక్క ముక్క కలిస్తే—డీలు అవుతుంది. అందరూ 'కౌంటు' ఇస్తారు. ఒక బ్యాంకు మేరకు రావచ్చు. ఆ ఉద్దేశ్యంతోనే ఉత్సాహంతోనే క్రిందపడ్డ ముక్క కలువకపోగా, పేకలోని ముక్క లాక్కున్నాడు. నాచురల్ సీక్వెన్సు కాలేదు. గుండె దడదడ కొట్టుకున్నది. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతున్నా—చెమటతో లాల్చీ తడిసింది. తన ముక్కల్లో స్పేరుగావున్న డైమన్ పదిని క్రిందకు వేశాడు. ఆముక్కే తీసికొని చేతిక్రింద ఆడుతూన్న రైస్‌మిల్ ఓనరు రామసుబ్బయ్య 'షో' చేస్తూ 'డబుల్స్' అన్నాడు. చంద్రం ప్రాణాలు గాలిలో కల్సినంత పనైంది. నాలుగుజోకర్లూ మినహాగా, మిగతా తొమ్మిది కార్డులూ చంద్రానికి అరవైఅయిదు పాయింట్ల కౌంటును పడవేశాయి. ఇంటర్‌నేషనల్ డబుల్స్‌లో అవి నాలుగు రెట్లకు పెరుగుతాయి. మొదటి ఆటలోనే చంద్రం పదహారు రూపాయల ఇరవైఅయిదు నయాపైసల్ని కోల్పోయాడు. మనిషి కృంగిపోయాడు. అధైర్యం కొండంతగా పెరిగింది. ఆలోచించి లేద్దామనుకున్నాడుగానీ — ఆటరూల్సు ప్రకారం రెండు 'కట్'లు విధిగా ఆడాలి. మధ్యలో లేవటానికి వీల్లేదు.

తర్వాత ఆటను 'డ్రాప్' చేసి పన్నెండు పాయింట్లు యిచ్చాడు చంద్రం. ఆ తర్వాత ఆట షైరిచేసి, చావుదప్పి కన్ను లొట్టబోయి, బ్రతికి—ఇరవైఎనిమిది పాయింట్లు యిచ్చుకున్నాడు. ఆట జరుగుతున్నకొద్దీ మనిషి మరింత దిగజారిపోతున్నాడు. 'నీ దురదృష్టం యింకా రాజ్యమేలుతూనేవుంది.

నువ్వు గెలువలేవు. ఇంకా ఆడితే వున్న డబ్బంతా పోవడమే గానీ–లాభం సున్న.' అంటూ మనస్సులోని మనస్సు ఏ మూలనో మూలుగుతూనే వుంది. కాని చంద్రం ఆడుతూనే వున్నాడు. ఆ కట్‌లో చివరిఆట తిప్పాడు. దాదాపు పోయిన పాయింట్లలో సగంవరకు తేల్చుకోగలిగాడు. మళ్ళీ అతనిలో ధైర్యం కళ్ళు తెరిచింది. ఉత్సాహం ఇనుమడించింది. శేఖరం ప్యూనుకు అయిదు రూపాయలిచ్చి డబుల్ క్యారియర్ భోజనం మిలిటరీ హోటల్నుంచి తీసికురమ్మని ఆర్డరిచ్చాడు.

చంద్రం శేఖరంతోపాటు భోజనం చేసేప్పటికే మధ్యాహ్నం ఒంటిగంటైంది. తర్వాత మళ్ళీ ఆటకు కూర్చున్నాడు. రెండుబ్యాంకులు గెలవడంపోయి–లెవల్సయితే లేచి వెళదామన్న పట్టుదలకొద్దీ ఆడడం మొదలెట్టాడు. కాని సాయంత్రం వాలిపోయినా లెవెల్సుకాలేదు. పైపెచ్చు యాభైరూపాయల బ్యాంకు పాయింట్లన్నీ మెల్లగా పోయాయి, ఎంత జాగ్రత్తగా ఆడినప్పటికీ. టేబుల్‌దగ్గర్నుంచి లేచాడు చంద్రం.

పరీక్షతప్పిన విద్యార్థీ, ప్రేమలో దగాపడ్డ యువకుడూ, భార్య అవినీతిని తెలుసుకున్న భర్తా, పేకలో డబ్బు పోగొట్టుకున్న మనిషీ–వీళ్ళ ముఖాల్ని ఆవరించిన విషాదాన్నీ, గంభీరతనూ, తెగింపునూ వర్ణించడం సులభంకాదు. చావుబ్రతుకుల్లో వున్న పిల్లవాని మందుకోసం భార్యయిచ్చిన బంగారపు వొంకీగాజుల్ని మార్వాడీదగ్గర అమ్మి ఆ డబ్బుతో వంద రూపాయలు గెల్చి, దారిద్ర్యంనుంచి విముక్తుడై ధనవంతుడ్ని అవుదామన్న ఆత్మవిశ్వాసంతో పేకాటలో కూర్చుని జేబు

లోని డబ్బుల్ని మొత్తాన్నీ పోగొట్టుకొన్న చంద్రం ముఖం తీరును కూడా వర్ణించడం సులభంకాదు. జుట్టంతా రేగి, ముఖమంతా పొగచూరిన గోడవలెఅయి, కళ్ళు నిరాశతో నలిగిపోయి, జీవితంపై అలక్ష్యం పెరిగిన చంద్రం గదిలోంచి హత్యచేసిన వాడివలె బయటకొచ్చాడు. సూర్యుని ఆఖరు కిరణాలు క్లబ్బు ఆవరణలోని చిన్నచిన్న గులకరాళ్ళపై నెత్తురు చిందినట్టుగా, ఎర్రగా పడుతున్నాయి. గార్డెన్‌లోని మందారపువ్వులు ఎర్రగా నవ్వుతున్నాయి. నిదరగన్నేరు చెట్టుక్రింద నాలుగు కుర్చీల్లో కూర్చుని – నలుగురూ కాలేజీ లెక్చరర్లు ఏదో విషయాన్ని గురించి మాట్లాడుకుంటూ విరగ బడి నవ్వుకుంటున్నారు.

చంద్రం తల ఇనుపదూలానికి 'ఢీ' కొన్నంత దిమ్ముగా వుంది. మనస్సు మొద్దుబారిపోయింది. 'ఏంచేయాలి? పిల్లవానికి మందెట్లా కొనుక్కెళ్ళడం? అసలు పిల్లవాడింతసేపూ బ్రతికి ఉన్నాడా? భార్య తనకోసం నిరీక్షిస్తూనే వుంటుందా? తనెట్లా ఇంటికి వెళ్ళడం ...?' మొదలైన ప్రశ్నలతో అతని బుర్ర తిరుణాలలో తప్పిపోయిన పిల్లవానివలె వుంది. క్లబ్బు వరం డాలో అటూ ఇటూ పదిసార్లు పచార్లు చేశాడు. ఏం తోచ లేదు. 'పదిహేను రూపాయలు తనకు అర్జెంటుగా కావాలి. ఎట్లా? ఎవరిస్తారు? ఎవర్ని అడగాలి —?' గబగబా పేకాట ఆడే గదిలోకి వెళ్ళి 'డ్రాప్' చేసి ప్రక్కవానికి పైరివేటు చేస్తూన్న శేఖరాన్ని బయటకు పిల్చాడు చంద్రం. శేఖరం పిలుపులోని కిటుకును గ్రహించినవాడై బితుకుబితుకుమంటూనే బయటకొచ్చాడు.

"గురూ! నాకు అర్జంటుగా పదిహేను రూపాయలు కావాలి. మా అబ్బాయి జబ్బుతో చనిపోయే స్థితిలో ఉన్నాడు. ఇంజక్షన్లు కొనాలి. పదిహేనురూపాయ లిచ్చావంటే పిల్లవాడికి ప్రాణంపోసిన పుణ్యం దక్కుతుంది." అన్నాడు చంద్రం దీనాతిదీనంగా.

శేఖరం జాలిగా పెదాలు విరిచాడు.

"లేవు బ్రదర్! నువ్వు చూస్తూనే వుంటివిగా. నాదీ బ్యాంకు పాయింట్లు 'ఔట్' కావచ్చాయి. నాకూ బజార్లో 'పర్చేజస్' ఉన్నాయి. ఎట్లాగాని దిగులుతో ఇదవుతున్నాను."

చంద్రంలోని అంతిమ ఆశకూడా కొండెక్కింది.

శేఖరం "వస్తాను బ్రదర్" అంటూ మళ్ళీ గదిలోకి వెళ్ళాడు.

చంద్రం కాళ్ళీడ్చుకుంటూ క్లబ్బునుంచి బయలుదేరాడు. క్లబ్బుగేటుముందు పేకాటలో ఆప్తమిత్రుడు సూర్యం కన బడ్డాడు. సిల్కు లాల్చీతో, మనోరంజనం పరిమళం ఘుమ ఘుమ లాడుతూండగా, రోల్డుగోల్డు ఫ్రేం కళ్ళజోడుతో అప్పుడే రిక్షా దిగాడు.

"సూర్యం! ఒక్కమాట" అంటూ ప్రక్కకుపిల్చి, చంద్రం తన అవసరాన్ని అతనితో విడమర్చి చెప్పాడు.

"సారీ, చంద్రం! నా దగ్గర అణాడబ్బులుకూడా లేవు. అందుచేతనే వారంరోజుల్నుంచీ పేకాట కూడా ఆడడం లేదుగా" అంటూ క్లబ్బులోకి నడిచాడు సూర్యం.

'ఔరా! లోకం ఎట్లాంటిది?' అన్నది చంద్రం మనస్సు ఏడ్వలేక ఏడుస్తూ. 'ఈ సూర్యంగాడికి తనెన్నిసార్లు బ్యాంకు

లకు బ్యాంకులు అప్పుగా యివ్వలేదూ! ఓసారి పేకాటలో మూడువందల పాయింట్లవరకూ బకాయిపడితే తను తర్వాత తీసివేయలేదూ! ఆ విశ్వాసం రవ్వంత వుందీ! ఛీ, ఛీ. రాను రాను మనుష్యుల్లో, స్వార్థం, మోసం, టక్కరితనం, తప్పించుకునే తత్వం, సాటివారిపట్ల జాలీ, సానుభూతి లేకపోవడం—ఎక్కువవుతూన్నవి. లోకం, ఇట్లాంటి అధ్వాన్నస్థితికి ఎందుకు దిగజారుతూన్నది! తోటివాడు కష్టాల కార్ఖానాలో ఎర్రగా మండి నల్లగా మాడిపోతూంటే - సహాయం చేద్దామన్న ఉద్దేశ్యం ఒక్కడికైనా వుంటేనా? అంతకు ముందు తనవల్ల సహాయం పొందినవాళ్ళు కూడా నిర్మొహమాటంగా, విశ్వాసరహితంగా ప్రవర్తిస్తున్నారు. ఇంతకూ ఒకళ్ళని నిందించి ప్రయోజన మేముంది? తను ఒక్తిదుర్మార్గుడు, దుష్టుడు; నీతీ నిజాయితీ లేనివాడు; వీసమెత్తు బుద్ధిలేనివాడు. నష్టజాతకుడు. చావు బ్రతుకుల్లో ఉన్న ఒక్కగా నొక్కకొడుకు, ఆ కొడుకును బ్రతికించుకొనేందుకు భార్య తన పెళ్ళినాటి బంగారు గాజుల్ని అమ్మి ముందు తీసికొనిరమ్మని పంపడం, తను ఆ డబ్బుతో - మంచంలోవున్న పిల్లవాడ్ని, కళ్ళలో ఆశాదీపాలతో ఎదురుచూచే భార్యనూ మర్చిపోయి, పేకాటలో కూర్చోవడమేమిటి? తను మనిషేనా? తనలో చీమూ, నెత్తురూ ఉన్నాయా? తనకి మనస్సు, హృదయము, ఆత్మ-ఉన్నాయా? లేవు. నిస్సందేహంగా లేవు. తను మనిషి కాడు. కసాయివాడు. పాషాణ హృదయం కలవాడు. పాపం శాంత ఎంతగా దుఃఖిస్తూ వుంటుందో! ఇంజక్షన్లు లేక బాబు మరణించివుంటాడేమో! శాంత ఇల్లెగిరిపోయేట్టు ఏడుస్తూ

వుంటుందేమో! ఛీఛీ. తనెంత నీచుడు? పేకాటలో ఆస్తినీ, పరువూ ప్రతిష్టల్నీ నాశనం చేసింది కాకుండా-చివరకు బాబు ప్రాణాన్ని కూడా పొట్టబెట్టుకున్నాడు. కన్నకొడుకును తన చేతులతోనే హత్య జేశాడు. ఇంతకంటె పాపాత్ముడు లోకంలో ఎవరైనా వుంటారా? శాంత అన్నట్లు - తనని భగవంతుడు కూడా క్షమించలేడు. తను ఇంటికి వెళ్ళలేడు. ఆ ఇల్లాలికి తన ముఖాన్ని చూపలేడు. ప్రేవులు బయట పడేట్లు దుఃఖించే ఆమెను తను చూడలేడు. ఈ రోజే తన బ్రతుక్కి ఆఖరిరోజు. ఆఖరిరోజుగా తను అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. 'ఈ జన్మలో నీ ముఖం చూడను' అన్నది అదృష్టదేవత. ఇంకా తను బ్రతకటం దేనికి? తన మనస్సు, ఆ మనస్సులో ఏర్పాటు చేసుకున్న విశ్వాసం, ఆ విశ్వాసంతో తగలబెట్టిన డబ్బూ—తన పతనానికి మెట్లు. అవి జారుడు మెట్లని తెల్సికోలేక—జీవిత భాగస్వామినియైన శాంత బ్రతుకును కూడా నాశనంచేశాడు. తనలో పరివర్తన కలగదు. తనకి మంచిరోజులురావు. తనలో పరివర్తనను కలిగించే అవకాశాలను కూడా దుర్వినియోగపర్చాడు. మరణం ఒక్కటే—తన జన్మకు సార్థకత. మరణం ఒక్కటే తన బ్రతుక్కి — గమ్యస్థానం. మరణం ఒక్కటే తనని వంచించిన ఆత్మవిశ్వాసానికి—ప్రతీకారం. తను చావాలి; చావాలి. ఈ రాత్రే చావాలి. ఇంటికి వెళ్ళకుండానే చావాలి. శాంత దుఃఖాన్ని చూడలేడు. శాంత ఏడ్పును వినలేడు. తన దుర్మార్గత, నీచత్వం, కట్టుకున్న భార్యమీదకంటె, జన్మకు సార్థకత చేకూర్చే సంసారంకంటె, ఒక్కగానొక్క కొడుకుమీదకంటే—పేకాటమీద తనకున్న

వదలని మమకారం, శాంతకు పూర్తిగా అర్థమయ్యేవుంటాయి. ఆమెలో—తనపై ఆ అభిప్రాయాల్ని తుడిచిపెట్టలేదు. సంసారాన్ని పాడుచేసిన దుర్మార్గునిగా లోకం దృష్టిలో తనపైనున్న ఆగ్రహాన్ని తొలగించుకోలేదు. తను బ్రతకటం వ్యర్థం. వ్యర్థం! మున్నాటికీ వ్యర్థం!...” అనుకుంటూ చంద్రం గాంధీచౌకులోకి వచ్చాడు.

వీధిదీపాలన్నీ చక్కగా వెలిగాయి. బజార్లు విద్యుద్దీపాల కాంతుల్లో స్నానాలు చేస్తున్నాయి.

మెడికల్ షాపులకేసి, కాఫీహోటళ్ళకేసి, ఫాన్సీ స్టోరులకేసి, క్లాత్ ఎంపోరియంలకేసి, పండ్లదుకాణాలకేసి— చూస్తూ మెయిన్‌బజారులో నడుస్తున్నాడు చంద్రం. అతని బుర్ర మండుతూన్న చితిలాగా ఉన్నది. కాని ఏమూలనో నూతనోత్సాహం, జీవితాన్ని ముగించనున్నవాని తెగింపూ, బాధ్యతల్ని వొదులుకున్న ఉపశమనం, — అతనిలో కొత్త ఉషారును ప్రవేశపెట్టాయి. మెల్లగా, షికారుకొచ్చినవాడిలా నడుస్తున్నాడు.

గాడిబావిదగ్గరకు రాగానే ఎలుకలమందు అమ్మేవాడు ఎదురైనాడు. ‘ఈ రాత్రికి చావలి’ అని గాఢంగా నిర్ణయించుకున్నాడుగానీ చంద్రం ‘ఎట్లా చావాలి!’ అని నిర్ణయించుకోలేదు. ‘ఎలుకలమందు తింటే మనుషులుకూడా చస్తారు. ‘ఆ మందే తిని చస్తే!...’ కాని చంద్రానికి కొన్ని సంశయాలు తగిలాయి. ఎలుకలమందువల్ల సుఖంగాచావడానికి వీలుండదు. నానా బాధపడి చావాల్సివుంటుంది. తనట్లా ఎందుకుచావాలి? సుఖంగా చనిపోయేమార్గాలు చాలావున్నాయి. చచ్చేటప్పుడు

కూడా కష్టంగా చావడం దేనికి? ఇందులోనైనా బుద్ధి నుపయోగించి, ఏ బాధా లేకుండా చావడం మంచిది. మద్రాసు మెయిల్ క్రింద పడడము మేలు. ఒక్కటే ఒక్క దెబ్బ! తల అటూ – మొండెము ఇటూ! లైఫ్ సఫా! ఛాప్టర్ ముగింపుకొస్తుంది. అదే మంచిపద్ధతి. తను రైలు క్రిందే పడాలి. కొన్ని క్షణాలే బాధ. ఆతర్వాత ఏమైందో తెలీదు...'

చంద్రం నేరుగా రైల్వే స్టేషన్‌కు వెళ్ళాడు. అక్కడ కొన్ని నిముషాల పాటు ప్లాట్‌ఫారం మీద పచార్లు చేశాడు. తర్వాత రైలు మార్గం వెంటే నడువసాగాడు. అవుటర్ సిగ్నల్ దాటి స్టేషన్లోని కాంతి దూరమయ్యే వరకూ ఆలోచిస్తూ నడిచాడు. కళేవరం యివతల చిన్న వంతెనపై కూర్చున్నాడు.

చీకటిని చీల్చుకుంటూ, పెద్ద చప్పుడుతో మద్రాసు మెయిల్ వస్తోంది. వంతెనమీద కూర్చున్న చంద్రం రెండు పట్టాల మధ్య గబుక్కున పడుకున్నాడు. రైలు చప్పుడూ, లైటూ దగ్గరవుతున్నాయి. కొన్ని ఫర్లాంగుల దూరంలోనే ఉంది. భూమి దద్దరిల్లేటు రైలు కూతవేసింది. గట్టిగా మూసుకొని హృదయాన్ని రాయిచేసికొని – మరణించేందుకు పట్టాల మధ్య పడుకున్న చంద్రం ఉలిక్కిపడి లేచాడు. తెల్లటి కాంతి కళ్ళల్లోకి గుచ్చుకుంది. రైలు ధ్వని చెవుల్లో ప్రతిధ్వనించింది.

'తనెందుకు చావాలి? ఆత్మహత్య మహాపాపం. తను చస్తే శాంత గతి యేంకాను? తను చావకూడదు. ఆత్మహత్య చేసుకోవడం – పిరికితనంతో బ్రతుకంటే భయపడి పారిపోవ

డమే!" అనుకున్నాడు వేగంగా. వెంటనే రైలు పట్టాలమీద నుంచి లేచి, ఎడంగా నిలబడ్డాడు.

మద్రాసు మెయిల్ ధన్ ధన్ మని చప్పుడు చేసుకుంటూ వెళ్ళింది.

చీకట్లో చిరునవ్వు నవ్వుకున్నాడు చంద్రం. జీవితానికి వెలుగు రేఖ దొరికినట్టుగా – ఆ చిరునవ్వుకు అర్థం. మెల్లగా నడిచి ఇంటికి వెళ్ళాడు.

గంగానమ్మపేటలో రిక్షా రంగన్న తాటాకుల నిట్టాడి ప్రక్కనే అతని పూరిల్లు. ఆ సందంతా నిశ్శబ్దంగా వుంది. మున్సిపాలిటీ వారి విద్యుద్దీపపు కాంతి చొరబడని ఆ సందులో చీకటి స్వేచ్ఛగా తారట్లాడుతూంది. చంద్రం తన ఇంటికి చప్పుడు చేయకుండా వెళ్ళి – తడికె సందులోంచి లోపలకు చూశాడు.

కోడిగుడ్డు లాంతరు గూట్లో వెలుగుతూంది. మంచంపై బాబు కళ్ళు తెరుచుకొనే పడుకుని ఉన్నాడు. శాంత కాళ్ళకట్ట దగ్గర కూర్చుని విసనకర్రతో విసరుతూంది.

'బాబు బ్రతికే ఉన్నాడు! ఎట్లా? ఇంజక్షన్లు ఎవరు తెచ్చారు?' – చంద్రం మనస్సు ఆనందంతో తేలిపోయింది.

తడికె తలుపు తెరచుకొని ఇంట్లోకి వెళ్ళాడు చంద్రం. శాంత తలెత్తి చూసింది.

"శాంతా నన్ను క్షమించు. ఈ దుర్మార్గుడిలో పరిపూర్ణమైన పరివర్తన కలిగింది." అంటూ భార్య కాళ్ళపై బడ్డాడు చంద్రం.

శాంత అదరిపోయింది.

"ఛీ, లేవండి. ఇదేం పని." శాంత భర్త తలను పైకి లేవనెత్తింది. ఆమెలో సిగ్గూ, సంతోషమూ, ఎబ్బెట్టుతనమూ కలిగాయి.

"నిజం. శాంతా! ఇవాళ నుంచీ నేను పేకాట ఆడను. పూర్తిగా మారిపోయాను. కష్టం చేసి బ్రతుకుతాను. నిన్నూ, బాబునూ పోషిస్తాను. నా బ్రతుకులోని చెడుకు ఇవాళే స్వస్తి. రేపట్నుంచీ కొత్త జీవితం" అన్నాడు ఆవేశంతో చంద్రం.

దిగ్భ్రమ చెందుతూ విన్నది శాంత.

"బాబు ఎట్లా బ్రతికాడు?"

"డాక్టరుగారే కరుణించి రెండుగంటల తర్వాత వచ్చి, తమ డబ్బుతో ఇంజెక్షన్లు తెప్పించియిచ్చారు. తర్వాత గంటకే బాబుకు స్పృహవచ్చి కోలుకోసాగాడు. మనం డాక్టరుగారి కెంతో ఋణపడివున్నాం."

అర్ధరాత్రివరకూ భార్యాభర్తలు సానుభూతిగా మాట్లాడుకున్నారు.

మర్నాడు ఉదయమే చంద్రం ప్రక్కయింటి రిక్షా రంగన్నదగ్గరకు వెళ్ళి — "మామా! ఇవాళనుంచి నేనుకూడా రిక్షా తొక్కుతాను. మీ యజమాని దగ్గర నాకో రిక్షా ఇప్పించు" అన్నాడు.

రిక్షారంగన్న సావకాశంగా ఆశ్చర్యపడి, "అట్టాగేలే" అన్నాడు.

★

నలందా ప్రెస్, తెనాలి-2